RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 316 | 07 బుధవారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## బీసీ రిజర్వేషన్లు పెంచుతామనే భయంతోనే కోర్టులకు వైకాపా: మంత్రి మండిపల్లి



**అమరావతి, రాజధాని వాయిస్ :** వైకాపాకు ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా లేకే కోర్టుల చుట్టూ తిరుగుతూ బురద చల్లడమే పనిగా పెట్టుకుందని ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజకీయ ప్రాతినిధ్యం పెంచుతామనే భయంతోనే స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు ఆ పార్టీ కోర్టులను ఆశ్రయిస్తోందని ధ్వజమెత్తారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతపై వైకాపాకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మంత్రి విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులు, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల అమలుకు ముందడుగు వేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, పల్లె పండుగ 3.0తో గ్రామీణ ప్రాంతాల్లో భారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ఇళ్ల నిర్మాణం తో పాటు రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నా రు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, వార్డుల నుంచి మేయర్ స్థాయి వరకు ప్రజల ఆశీర్వాదంతో విజయఢంకా మోగిస్తామని మండిపల్లి ధీమా వ్యక్తంచేశారు.

## రాష్ట్రంలో తేలికపాటి వర్షాలకు అవకాశం

**విశాఖపట్నం, రాజధాని వాయిస్ :** కొమొరిన్ ప్రాంతం నుంచి తమిళనాడు, దక్షిణ కర్ణాటక మీదుగా ఉత్తర కర్ణాటకపై ద్రోణి సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడ్రోజుల పాటు కోస్తాంధ్రలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిరుపతిలో అత్యధికంగా 38.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయింది. అనంతపురంలో 37.9, నెల్లూరులో 37.1, కర్నూలులో 36.6, కావలిలో 36.6, నంద్యాలలో 36 డిగ్రీలు నమోదైంది.

## స్థానిక ఎన్నికల వ్యూహాలపై

# చంద్రబాబు - పవన్ కీలక భేటీ

- కూటమి సమన్వయంపై సుదీర్ఘ చర్చ
- బీసీ రిజర్వేషన్ల విచారణకు ముందు రాజకీయ కసరత్తు
- క్షేత్రస్థాయి బలానికే ప్రాధాన్యమివ్వాలన్న సంకేతాలు



**అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 06 :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య కీలక సమావేశం జరిగింది. మంగళవారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం ముగ్గురు నేతలు అల్పాహార సమావేశంలో పాల్గొంటూ రానున్న ఎన్నికలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పక్షాలు సమన్వయంతో ముందుకు సాగేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య అవగాహనతో సీట్ల పంపిణీ చేపట్టడంతో పాటు ప్రతి ప్రాంతంలో బలమైన అభ్యర్థులను నిలబెట్టే అంశంపై అభిప్రాయాలు పంచుకున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.శాతం లెక్కలు లేదా పార్టీ ప్రాతిపదిక కంటే క్షేత్రస్థాయిలో బలం ఉన్న నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే అంశంపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. స్థానిక పరిస్థితులు, ప్రజాభిప్రాయం, పార్టీ బలం ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని నేతలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యంగా కూటమి పక్షాలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మొదటి దశలో జరగనున్న నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలపై ప్రత్యేకంగా సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణ, ప్రచార ప్రణాళికలు, స్థానిక నాయకత్వ సమన్వయం, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కూటమి పక్షాల మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించే దిశగా చర్చలు సాగినట్లు సమా చారం.ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్‌పై రానున్న శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. న్యాయస్థానం తీర్పు అనంతరం స్థానిక ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశముందని నేతలు అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయడం, కూటమి బలాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## గిరిజన సంక్షేమం -- పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా అడుగులు

- ప్రకృతి--పర్యాటకానికి కొత్త ఊతం
- గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు
- వర్చువల్‌గా ప్రారంభించిన పవన్ కళ్యాణ్



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాష్ట్ర ప్రజలను ప్రకృతితో మరింత అనుసంధానం చేయడంతో పాటు గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నగర వన యోజన పథకంలో భాగంగా రాష్ట్రంలో నూతనంగా అభివృద్ధి చేసిన ఆరు నగరవనాలను ఆయన మంగళవా రం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గిరిజన సంక్షేమం అంశాలపై తన దృష్టిని వివరించారు.రాష్ట్రంలో ఇప్పటికే 19 నగరవనాలు ఉండగా, తాజాగా ప్రారంభించిన ఆరు నగరవనాలతో వాటి సంఖ్య 25కు చేరిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. సుమారు 305 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కల పెంపకానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజలకు ప్రకృతి అనుభూతిని అందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వీటిలో నడక మార్గాలు, సైక్లింగ్ మార్గాలు, పిల్లల ఆట స్థలాలు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని నగరవనాలు సముద్రతీర పర్యాటక ఆకర్షణలుగా నిలవనున్నాయని, కోటప్పకొండ నగరవనం ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. వినుకొండ, దేవరంపాడు, మాచర్ల ప్రాంతాల్లో ఏర్పాటైన నగరవనాలు కూడా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యకర వాతావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ప్రకృతికి దగ్గరవడం ద్వారా ఆరోగ్యం, పర్యావరణ అవగాహన రెండూ పెరుగుతాయని అన్నారు. ఎకో పర్యాటక రంగాన్ని విస్తరించడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వెలిగోడు అడవి సఫారీ, మారేడుమిల్లి ప్రకృతి విహారాలు, తూర్పు కనుమల అటవీ ప్రాంతాల అందాలను ప్రజలకు చేరువ చేయనున్నట్లు చెప్పారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ప్రకృతిని ప్రేమించి భావితరాలకు సంపదగా అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కు ప్రజల భాగస్వామ్యం అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. రాష్ట్రాన్ని ప్రకృతి, పర్యాటక రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అటవీశాఖ రూపొందించిన నల్లమల అటవీ ప్రాంతంలోని అరుదైన వృక్ష సంపదపై ప్రత్యేక గ్రంథాలు, మార్గదర్శక పుస్తకాలను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అటవీ అభివృద్ధి సంస్థ సుస్థిర నిర్వహణకు గుర్తింపుగా పొందిన ప్రత్యేక ప్రమాణ పత్రాన్ని కూడా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 25 ఏళ్ల నాయకత్వం.. మోదీకి అభినందనలు తెలుపుతూ క్యాబినెట్ తీర్మానం



**రాజధాని వాయిస్** ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్ర క్యాబినెట్ అభినందనలు తెలిపింది. గుజరాత్ సీఎంగా వరుసగా మూడుసార్లు సేవలందించిన ఆయన.. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేసింది. 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని తెలిపిం ది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది.“ గుజరాత్‌లో విజయవం తమైన కార్యక్రమాలు చేపట్టిన మోదీ.. అక్కడ అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ దార్శనికతతో ముందుకెళ్తున్నారు. చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను, దేశంలో పేదరికాన్ని స్వయంగా చూసిన ఆయన.. ఆ అనుభవాలతో ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు, రైతులు, యువతకు అవకాశాలను విస్తరించేందుకు కృషి చేస్తున్నారు. ధైర్యంతో సంస్కరణలు చేపడుతున్నారు. మోదీ నాయకత్వంలో మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగింది. హైవేల విస్తరణ, రైల్వేల ఆధునికీకరణ వేగంగా జరుగుతోంది.ఆయన పాలనలో డిజిటల్ సేవల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న వేళ.. తన నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని సరైన దిశలో ముందుకు తీసుకెళ్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై మన దేశానికి ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటివి.. దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ రాజీపడని వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. 2047 నాటికి సుసంపన్న, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించేందుకు సమష్టి కృషి చేయాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు మద్దతుగా నిలుస్తూ ఈ తీర్మానానికి ఆమోదం తెలుపుతున్నట్లు” క్యాబినెట్ వెల్లడించింది.

## చిన్న తరహా పరిశ్రమలకు చేయూత !

న్యూఢిల్లీ **రాజధాని వాయిస్** : చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎస్ఎంఇ) దీర్ఘకాలిక మూలధనం అందించేందుకు రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఇ గ్రోత్ ఫండ్ ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. దేశంలో రవాణా, లాజిస్టిక్స్ రంగాల ప్రణాళిక, పర్యవేక్షణ, ప్రాజెక్టుల పరిశీలన కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటిఎల్ఎ)ని ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. ఎస్ఎంఇ గ్రోత్ ఫండ్ గురించి తొలిసారిగా ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. ఇందులో ఈక్విటీ మద్దతు ఇవ్వడం, ద్రవ్యపరమైన చర్యలు, వృత్తిపరమైన తోడ్పాటునం దించడం వుంటాయి. రూ.500 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయంతో చేపట్టే కేంద్ర ప్రభుత్వ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఐటిఎల్ఎ సాంకేతిక మదింపు నిర్వహించనుంది. సమగ్ర రవాణా, లాజిస్టిక్స్ ప్రణాళికలు, పరిశోధన, ప్రాజెక్టు పరిశీలన, పర్యవేక్షణ, విధానపరమైన మద్దతు, డేటా విశ్లేషణ వంటి కార్యకలాపాలకు ఐటిఎల్ఎ సుప్రీం సంస్థగా వ్యవహరి స్తుంది. దేశంలోని రవాణా సదుపాయాల సమర్థతను, సుస్థిరతను, సామర్థ్యాలను ఐటిఎల్ఎ పెంపొందిస్తుందని అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల పాటు నిరాట ంకంగా నాయకత్వ బాధ్యతలను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయనను అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర మంత్రివర్గ తీర్మానంలో పది కీలక అంశాలు ఉన్నాయి

# బీసీ రిజర్వేషన్ల కోసం రాజీలేని న్యాయ పోరాటం

**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజీలేని న్యాయ పోరాటం కొనసాగిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టు ద్వారా న్యాయం సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అధిగమించేందుకు అవసరమైన గణాంకాలు, ఆధారాలు, ఎంపైరికల్ డేటాను సమగ్రంగా సిద్ధం చేసి న్యాయస్థానం ముందు ఉంచుతున్నామని చెప్పారు. హైకోర్టు తీర్పులను పూర్తిగా అధ్యయనం చేసి, న్యాయ నిపుణుల సలహాలతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నామని వివరించారు.బీసీలకు దక్కాల్సిన అవకాశాలను అడ్డుకునేందుకు కొందరు రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలతో వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి ఆరోపించారు. అయితే ప్రభుత్వం మాత్రం బీసీల హక్కుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల నుంచి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మేయర్‌ల వరకు అనేక ప్రజాప్రతినిధి స్థానాల్లో బీసీలకు అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో చట్టసభలు, అసెంబ్లీ, పార్లమెంట్ వంటి ఉన్నత స్థాయి రాజకీయ వేదికలకు ఎదగడానికి ఈ రిజర్వేషన్లు బలమైన పునాది అవుతాయని అభిప్రాయపడ్డారు.వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బలహీన వర్గాల రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందన్నారు. సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు, భవిష్యత్తు న్యాయ వ్యూహాలపై



చర్చించేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు. ప్రముఖ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, దేవదత్ కామత్‌లతో సమావేశమై తదుపరి కార్యాచరణపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. సామాజిక న్యాయం సాధించే దిశగా అవసరమైన అన్ని న్యాయ, పరిపాలనా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని మంత్రులు ప్రకటించారు.

# మొక్కల లెక్క కాదు.. మనుగడ లెక్క ముఖ్యం

- హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ
- 2047 నాటికి 50 శాతం పచ్చదనం సాధనకు కార్యాచరణ
- అన్ని శాఖల సమన్వయంతో హరిత విప్లవానికి పిలుపు
- ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు నాగబాబు




**మంగళగిరి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు నాగబాబు పిలుపునిచ్చారు. అటవీ శాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, రహదారులు, విద్య, పరిశ్రమలు, స్థానిక సంస్థలు సహా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేస్తేనే ఈ మహత్తర లక్ష్యాన్ని సాధించగలమన్నారు. పచ్చదనం పెంపు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, పరిశ్రమలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ తొలి సమావేశంలో భవిష్యత్ హరిత ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా పది కోట్ల మొక్కలను సిద్ధం చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించినట్లు నాగబాబు వెల్లడించారు. తొలి దశలో ఐదు వందల మండలాల్లో ఐదు వందల నర్సరీలకు స్థలాలను గుర్తించి పదిహేను వేల ప్రాథమిక బెడ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా అవి బతికి మహా వృక్షాలుగా ఎదిగే వరకు పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. సంఖ్యల కంటే మనుగడ శాతానికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. స్థానిక వాతావరణం, నేల స్వభావానికి అనుగుణమైన జాతులను ఎంపిక చేసి పెంచాలని, రావి, మర్రి, వేప, చింత, కానుగ, ఉసిరి, పనస, మోదుగ, ఇప్ప, రేల వంటి స్థానిక వృక్షాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. రహదారుల వెంట పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రతి మండలానికి ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించి భూమి లభ్యత, మొక్కల ఎంపిక, నాటడం, నీటి సరఫరా, సంరక్షణ, మనుగడ పరిశీలన వంటి అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మూడు నుంచి ఐదు మీటర్ల ఎత్తు కలిగిన బలమైన మొక్కలతో వృక్ష బ్యాంకులను ఏర్పాటు చేసి రహదారులు, పట్టణాలు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో విస్తృతంగా నాటాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ భూములు, ఖాళీ ప్రదేశాలను పచ్చదన కేంద్రాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దాదాపు వెయ్యి యాభై మూడు కిలోమీటర్ల సముద్ర తీరం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నాగబాబు పేర్కొన్నారు. సముద్ర అలల ప్రభావాన్ని తగ్గించే మడ అడవుల విస్తరణ, తీర రక్షణకు ఉపయోగపడే తాటి తోటల పెంపకం, పచ్చని రక్షణ వలయాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. తీర ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను సంరక్షించడం కూడా ముఖ్య లక్ష్యమని వివరించారు. హరిత కార్యక్రమాలను పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధికి అనుసంధానం చేయాలని అభిప్రాయపడ్డారు. నర్సరీలను కేవలం మొక్కల పెంపక కేంద్రాలుగా కాకుండా ఉపాధి అవకాశాల కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. స్థానిక యువత, మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలను మొక్కల పెంపకం, నిర్వహణ, సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమల సామాజిక బాధ్యత నిధులు, పర్యావరణ పరిరక్షణ నిధులను వినియోగిస్తూ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచాలని కోరారు. ఒక పరిశ్రమ--ఒక గ్రామం, ఒక పరిశ్రమ--ఒక పచ్చని మండలం, ఒక పరిశ్రమ--ఒక హరిత మార్గం వంటి కార్యక్రమాలను అమలు చేయాలని ప్రతిపాదించారు. ఏపీ గ్రీన్ కార్యక్రమంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకమని నాగబాబు స్పష్టం చేశారు. నర్సరీ నుంచి మొక్క నాటడం వరకు ప్రతి దశను భౌగోళిక గుర్తింపుతో నమోదు చేసి డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడ నాటారు, ఎన్ని నాటారు, ఎన్ని బతికాయి అనే అంశాలపై స్పష్టమైన లెక్కలు ఉండాలని పేర్కొన్నారు. ప్రతి లక్ష్యానికి బాధ్యత వహించే అధికారులను ముందుగానే నిర్ణయించి నిరంతర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాగా, వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దడం నిజమైన విజయమని పేర్కొంటూ హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# 6 నెలల్లో మరో 4,400 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల కొత్త భవన నిర్మాణాల పూర్తి

**గుడివాడ, రాజధాని వాయిస్ :** గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్‌లోని జనార్ధనపురంలో నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంత్రి, మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగానే రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మరో 266 భవనాలను వర్చువల్‌గా ఏకకాలంలో ప్రారంభించారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.105 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. 24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల పరిధిలో ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి చెప్పారు. రాబోయే 6 నెలల్లో మిగిలిన 4,400 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలను సిద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తదుపరి ప్రారంభ కార్యక్రమశీ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామం నుంచి పట్టణానికి వెళ్లి వైద్యం పొందాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలనే గ్రామానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ లో ఒకేసారి 267 నూతన ఆరోగ్య భవనాలను ప్రారంభించడం అరుదైన ఘట్టంగా నిలిచింది.

**నిలిచిన పనులు.. పెరిగిన భారం**

గత ప్రభుత్వ నిర్వాకంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలతోపాటు కొత్తగా చేపట్టిన నిర్మాణాలు కలిపి మొత్తం 4,400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం వివిధ పథకాల కింద రూ.1,128.02 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.
నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో వ్యయం కూడా పెరిగిందని తెలిపారు. గతంలో ఒక్కో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సుమారు రూ.17.50 లక్షలు ఖర్చు కాగా, ప్రస్తుతం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఒక్కో కేంద్రానికి సుమారు రూ.36 లక్షల వరకు కేటాయిస్తున్నామని వివరించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద మరో సుమారు 700 కేంద్రాలను ఒక్కో కేంద్రానికి రూ.55 లక్షల చొప్పున అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో గ్రామానికే వైద్యం**

ప్రతి 5 వేల జనాభాకు ఒకటి చొప్పున ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి కేంద్రంలో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు, 71 రకాల వైద్య పరికరాలు



అందుబాటులో ఉంటాయని చెప్పారు. బీపీ, మధుమేహం, మాతా శిశు ఆరోగ్యం, కంటి, నోటి ఆరోగ్యం, వృద్ధుల ఆరోగ్యం, అంటువ్యాధులను ముందుగానే గుర్తించేలా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైన వారికి ఉన్నత వైద్య సేవలకు పంపించడంతోపాటు, దూర వైద్య సేవల ద్వారా నిపుణుల సలహాలు అందించే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**'సంజీవని'తో ఆరోగ్య సమాచారం ఒకేచోట**

ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, భవిష్యత్తులో అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి 'సంజీవని' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# పరిశ్రమల్లో మృత్యు ఘోష..!

**తిరుపతి, రాజధాని వాయిస్ ::** పరిశ్రమలు వస్తున్నాయి.. పెట్టుబడులు పెరుగుతు న్నాయి.. ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయి. లాభాలతో యాజమాన్యాల జేబులు నిండుతు న్నాయి.. కానీ ఈ అభివృద్ధికి ప్రధాన కారణమైన కార్మికుల శ్రమను దోచుకోవడం ఒకటైతే, ఆ కార్మికుల ప్రాణాలకు ఏమాత్రమూ భద్రత లేదన్నది వాస్తవం. యంత్రాల మోత మధ్య పనిచేస్తున్న కార్మికులకు రేపటి సూర్యుని చూస్తామన్న నమ్మకం లేదు. తిరుపతి జిల్లాలో ఏడాది వ్యవధిలో పరిశ్రమల్లో ప్రమాదాల గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా శ్రీసిటీలోని 'టిల్' కంపెనీలో జరిగిన ప్రమాదంతో కలిపి 19 ప్రమాదాల్లో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. 61 మంది గాయాలపాలయ్యారు. ఒకవైపు పారిశ్రామిక ప్రగతి.. మరో వైపు వరుస ప్రమాదాలు. ప్రమాదం జరిగినపుడే అధికార యంత్రాంగం హడావిడి తప్ప, నిబంధనల ప్రకారం పరిశ్రమల్లో భద్రతను తనిఖీ చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి జిల్లాలో ఇటీవల తాజాగా జరిగిన 'టిల్' పరిశ్రమలో బాయిలర్ పేలడంతో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. గతంలో పెళ్లకూరు మండలంలో అగర్వాల్, రేణిగుంట మండలంలో నివో లింక్ మొబైల్ పరిశ్రమ, శ్రీకాళహస్తి రూరల్ పరిధిలోని సుధా సోమిని టైల్స్ పరిశ్రమలోనూ జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే తనిఖీల వైఫల్యంగా గుర్తించారు. తిరుపతి జిల్లాలో 1300 పైగా (శ్రీసిటీలో 250 కలుపుకుని) ఉన్నాయి. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు.

**జనావాసాల మధ్యే పరిశ్రమలు ...**ముఖ్యంగా పరిశ్రమల స్థాపన నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా సత్యవేడు మండలం చెరివి ఊరిలోనే 'టిల్' ఫార్మా కంపెనీ ఉంది. పెళ్లకూరు మండలం ఎంఎస్ అగర్వాల్ కెమికల్ ఫ్యాక్టరీ సైతం జనావాసాల మధ్యనే ఉంది. రేణిగుంట, గాజులమండ్యం పారిశ్రామికవాడల్లోని ఫ్యాక్టరీలూ జనావాసాల మధ్యే ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లోని అగ్నిమాపక శాఖలు, ఆసుపత్రులు వంటి అత్యవసర సేవలు తగిన పరికరాలతో, శిక్షణ పొందిన సిబ్బందితో సిద్ధంగా ఉండాలి.

**భద్రతా చర్యలపై పలు అనుమానాలు...**ఫ్యాక్టరీల్లో నిరంతరం తనిఖీలు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో 24,642 ఫ్యాక్టరీలుం డగా, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు కేవలం 42 మంది మాత్రమే ఉన్నారు. అంటే ఒక్కో ఇన్‌స్పెక్టర్ పరిధిలో 587 ఫ్యాక్టరీలు (2023 గణాంకాలు) ఉన్నాయి. తిరుపతి జిల్లాలో ఈ ఏడాది 2025, అక్టోబర్ తరువాత జరిగిన ప్రమాదాల వివరాలు**ఫ్యాక్టరీల్లో భద్రతా చర్యలేవి : కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోడ్‌లతో గతంలో ఉన్న భద్రతా నిబంధనలు బలహీన పడ్డాయి. పరిశ్రమల అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదు. అయితే లాభాల కోసం కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టే ధోరణిని అడ్డుకోవాలి. తాజాగా టిల్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి.

**పొంతన లేకుండా పరిశ్రమల శాఖ సమాధానాలు...**జిల్లాలో పరిశ్రమలో భద్రతా చర్యలు ఏం తీసుకున్నారు? అని 'ప్రజాశక్తి' పరిశ్రమల శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా భద్రతా చర్యలు తమ పరిధి కాదని, ఇండస్ట్రీస్ చీఫ్ చూస్తారని సమాధానం ఇచ్చారు. ఇండస్ట్రీస్ చీఫ్ మురళీని ఫోన్‌లో సంప్రదించగా తమకు రెగ్యులర్‌గా ఒక జిల్లా ఉండదని, రెండు నెలల క్రితం తిరుపతి జిల్లాలో తనిఖీలు చేశామని, చర్యలు తీసుకోవాల్సిన పరిశ్రమలపై పరిశ్రమాధికారులకు నివేదిక ఇచ్చానని సమాధానం ఇచ్చారు.

# పాక్‌కు రక్షణ రహస్యాలు.. ఏపీలో బయటపడిన భారీ కుట్ర

**అమరావతి, రాజధాని వాయిస్ :** ఏపీలో గూఢచర్యం వ్యవహారం కలకలం రేపుతోంది. ఆపరేషన్ ఫైర్‌వాల్‌తో భారీ కుట్ర బయటపడింది. పాకిస్థాన్‌కు రక్షణ రహస్యాలు చేరవేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కుట్రను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ (ఏపీ సీఐ) ఛేదించింది. 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' పేరిట ఏపీ సీఐ సెల్ సంచలన ఆపరేషన్ చేపట్టింది. 13 మంది నావికాదళ సిబ్బంది సహా 18 మంది వ్యక్తులపై నిఘా ఉంచింది. అత్యంత గోప్యంగా వ్యూహాన్ని అమలు చేసింది. ఈనెల 1న 12 ప్రత్యేక బృందాలతో మెరుపుదాడి చేసింది. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృతంగా సోదాలు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసింది. విచారణలో పాక్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో నేవీ సిబ్బంది రహస్య సంబంధాలు బహిర్గతమయ్యాయి. విశాఖపట్నం కేంద్రంగా గూఢచ ర్యం కొనసాగినట్లు ఏపీ సీఐ సెల్ గుర్తించింది. సమాచారాన్ని ఎన్‌క్రిప్టెట్ సాఫ్ట్‌వేర్ ద్వారా శత్రు దేశానికి ఈ నెట్‌వర్క్ చేరవేస్తున్నట్లు కనిపెట్టింది. దీనిపై విజయవాడలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ పీఎస్‌లో 3 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 147, 148 రెడ్‌విత్ 3(5)తో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం 1967 లోని సెక్షన్లు 17, 18 కింద కేసు నమోదు చేశారు. అధికారిక రహస్యాల చట్టం 1923 సెక్షన్ కింద కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాజధాని పనులపై నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష

నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేయాలని సీఎం సూచన
కేంద్రంతో సమన్వయం చేసుకుని ఔటర్ రింగ్ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఆదేశం




**అమరావతి, రాజధాని వాయిస్ :** రాజధాని అమరావతిలో నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు జరిగేలా ప్రణాళికతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధాని అమరావతి పనులపై క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సీఎం నెలవారీ సమీక్ష నిర్వహించారు. రాజధాని పరిధిలో చేపట్టిన 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. పనుల పరోగతిని, ఆయా ప్రాజెక్టుల స్థితిగతులను అధికారులు వివరించారు. గడిచిన నెలలో రాజధానిలో రూ.1,345 కోట్ల విలువైన పనులు చేసినట్టు చెప్పారు. వీటిని రూ.2 వేల కోట్లకు తీసుకువెళ్లాలని సీఎం అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు... ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించాలన్నారు. దీని కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాజధాని పనుల్లో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. ఐకానిక్ భవనాల నిర్మాణాల విషయంలో ఎక్కడా పనులు ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనం ఐకానిక్‌గా ఉండాలన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తరహాలోనే నిర్మాణ రంగంలోని వారికి ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధుల హాజరయ్యారు.

# తమిళనాడు సీఎం విజయ్‌కు విజయవాడ ఉత్సవ్‌కు ఆహ్వానం




**రాజధాని వాయిస్** తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు తిరు. సి. జోసెఫ్ విజయ్ ని విజయవాడ ఉత్సవ్ కు నరసరావుపేట ఎంపీ, టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు ఢిల్లీలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, కేశినేని శివనాథ్, జీఎంసీ హరీష్ బాలయోగి, విజయవాడ ఉత్సవ్ కమిటీ చైర్మన్ కె.మురళితో కలిసి విజయ్ ను కలిశారు. విజయ్ తో జరిగిన భేటీ ఆత్మీయంగా సాగిందని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఆయన వినయం, ఆప్యాయత, సౌమ్యత ఆకట్టుకున్నాయని తెలుగు, తమిళ ప్రజల మధ్య ఎంతో కాలంగా కొనసాగుతున్న సాంస్కృతిక అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలుగు, తమిళ భాషలు, సంస్కృతి, సినిమా, కళలు, సంప్రదాయాలు రెండు రాష్ట్రాల ప్రజలను మరింత దగ్గర చేశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఉత్సవ్ ద్వారా తెలుగు-తమిళ సాంస్కృతిక బంధాన్ని మరింత ఘనంగా చాటిచెప్పే అవకాశం లభిస్తుందన్నారు. విజయ్ విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని తెలుగు-తమిళ సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# ఎన్ఎస్ఇ షేర్ 9 శాతం పతనం..!

ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) షేర్ లిస్టింగ్ రోజు నమోదైన లాభాలను కోల్పోయి ఐపిఒ ధర కంటే దిగువకు పడిపోయింది. సెప్టెంబర్ 24న రూ.1,785 ఐపిఒ ధరతో పోలిస్తే స్వల్ప లాభంతో రూ.1,800 వద్ద లిస్టయిన షేరు.. అదే రోజు రూ.1,878 గరిష్ఠాన్ని తాకింది. దీంతో ఎన్ఎస్ఇ మార్కెట్ విలువ రూ.4.64 లక్షల కోట్లకు చేరింది. అయితే ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సోమవారం షేరు రూ.1,712 కనిష్ఠానికి పడిపోయింది. లిస్టింగ్ గరిష్ఠంతో పోలిస్తే దాదాపు 9 శాతం, ఐపిఒ ధరతో పోలిస్తే 4 శాతం నష్టపోయింది. షేరు పతనంతో ఎన్ఎస్ఇ గరిష్ఠ మార్కెట్ విలువ నుంచి దాదాపు రూ.41,000 కోట్ల సంపద ఆవిరైంది. ప్రస్తుతం సుమారు రూ.4.27 లక్షల కోట్ల మార్కెట్ విలువతో దేశంలోని అత్యంత విలువైన కంపెనీల జాబితాలో 12వ స్థానానికి పడిపోయింది.

**మార్కెట్లకు చమురు ధరల ఊరట**

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. మంగళవారం సెన్సెక్స్ 685.34 పాయింట్లు పెరిగి 73,067.81కు చేరింది. నిఫ్టీ 220.35 పాయింట్లు లాభపడి 22,776.10 వద్ద ముగిసింది. రూపాయి విలువ డాలర్‌కు 96.43గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ చమురు ధర 98.64 డాలర్లుగా నమోదయ్యింది.

# త్రికోటేశ్వరుని భక్తులకు ఆహ్లాదకర కానుక

### 2 కోట్లతో కోటప్పకొండ గిరి ప్రదక్షిణ రోడ్డున నగరవనం ప్రారంభం
### వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్
### ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, రాజధాని వాయిస్ అక్టోబర్ 06** ప్రసిద్ధ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి క్షేత్రానికి విచ్చేసే భక్తులు, ప్రకృతి ప్రేమికులకు సరికొత్త ఆహ్లాదాన్ని పంచేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ రోడ్డు పక్కన ?2 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దిన నూతన 'నగరవనం' ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలని స్పష్టం చేశారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమా లకే కాకుండా భక్తులకు మానసిక ప్రశాంతతను అందించే పవిత్ర నిలయాలుగా తీర్చిదిద్దుతున్నామని, పవిత్ర గిరి ప్రదక్షిణ చేసే వేలాది మంది భక్తులకు ఈ నగరవనం చక్కటి సేదతీర్పునిస్తుందని ఆకాంక్షించారు. స్థానికంగా కోటప్పకొండ వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై, నగరవనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి, పర్యావరణ ప్రాజెక్టులకు నిధులు కేటాయించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లకు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోటప్పకొండను సమగ్ర పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నా రు. నగరవనంలో భక్తుల రక్షణ, పారిశుధ్యం, తాగునీరు, పిల్లల ఆటస్థలాలు, విశ్రాంతి షెల్టర్ల నిర్వహణలో రాజీ పడకూడదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి, అటవీ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజానీకం మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే చదలవాడ

### 120 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

**నరసరావుపేట,రాజధాని వాయిస్ అక్టోబర్ 06** గత జూలై నెలలో కోటప్పకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇచ్చిన హామీని నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నెరవేర్చారు. భారతి లైఫ్‌లైన్ ఫౌండేషన్ సౌజన్యంతో పాఠశాలకు చెందిన 8, 9, 10 తరగతుల 120 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సరికొత్త సైకిళ్లను పంపిణీ చేశారు. గొనెపూడి, కొండకావూరు, గురవయ్య పాలెం, పమిడిమర్రు తదితర గ్రామాల నుంచి పాఠశాలకు రావడానికి సరైన బస్సు, ఆటో సౌకర్యాలు లేక విద్యార్థులు రోజూ కిలోమీటర్ల మేర నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జూలై సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల కష్టాలను చూసి చలించిపోయిన ఆయన, వారి విద్యాభ్యాసానికి దూరం అడ్డంకి కారాదని, స్వయంగా బాధ్యత తీసుకొని అందరికీ సైకిళ్లు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు నేడు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణంలో విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తే మన సమాజానికి నిజమైన సంపద. పేదరికం గానీ, సరైన ప్రయాణ వసతులు లేకపోవడం గానీ పిల్లల చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం. గతంలో పేరెంట్స్ మీటింగ్‌లో పిల్లలు తమ ఆవేదన వ్యక్తం చేసినప్పుడు, వారి కళ్లలోని చదువుకోవాలనే తపన నన్ను కదిలించింది. ఆ రోజు ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు భారతి లైఫ్‌లైన్ ఫౌండేషన్ సహకారంతో 120 మంది విద్యార్థులకు సైకిళు అందించడం ఎంతో సంతృప్తినిచ్చింది. పిల్లలు సమయానికి బడికి చేరుకుని, శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. నరసరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ముందుంటాను. విద్యార్థుల ఉన్నతి కోసం మేము అండగా ఉంటాం అని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఉదారంగా సహకరించిన భారతి లైఫ్‌లైన్ ఫౌండేషన్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ సంతో



షం వ్యక్తం చేశారు. రోజూ మా పిల్లలు ఎండనక, వాననక కిలోమీటర్ల దూరం నడిచి బడికి వెళ్తుంటే తల్లిదండ్రులుగా మేము ఎంతో వేదన చెందేవాళ్లం. ఎంతోమంది నాయకులను చూశాం కానీ, పేరెంట్స్ మీటింగ్‌లో మా పిల్లలు అడిగిన చిన్న కోరికను గుండెలకు హత్తుకుని, కేవలం కొద్ది రోజుల్లోనే 120 మందికి సైకిళ్లు కొనిచ్చి మాట నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు మన చదలవాడ అరవింద బాబు ఆయన రూపంలో దేవుడే మా కష్టాలను తీర్చినంత సంతోషంగా ఉంది. విద్యార్థులపై ఆయన చూపిన ప్రేమాభిమానాలను మేము జీవితంలో మర్చిపోలేము. మా కుటుంబాలన్నీ ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాయి అంటూ తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలియజేశారు. సైకిళ్ల పంపిణీ అనంతరం ఉత్సాహభరిత వాతావరణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతూ పాఠశాల నుంచి శివ కుటుంబం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని ఉత్సాహంగా నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా శివ కుటుంబం ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. విద్యార్థులందరూ పర్యావరణాన్ని కాపాడేందుకు ఒక్కో మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, భారతి లైఫ్‌లైన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలు.. క్రీడాకారులకు రూ.2 లక్షల సాయం!

**గుంటూరు, రాజధాని వాయిస్ :** కామన్వెల్త్ క్లాసిక్ అండ్ ఈక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ -- 2026లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి చక్కటిప్రతిభ కనపరచి బహుమతులు సాధించిన యువ క్రీడాకారులు మధిర షానన్, బొల్లు లిఖిత, సంకా కౌశిక్, మరియు కోచ్ ఘట్టమనేని సాయి రేవతిలను జన చైతన్య గ్రూపు అధినేత మాదల చైతన్య అభినందించారు.మంగళవారం చంద్రమౌళి నగర్ లోని ఆయన కార్యాలయంలో బహుమతులు గెలుచుకున్న క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. 47 కిలోల జూనియర్ విభాగంలో మధిర షానన్ వెండి పతకం, 76 కిలోల సబ్ జూనియర్ విభాగంలో బొల్లు లిఖిత బంగారు పథకం, 95 కిలోల విభాగంలో సంకా కౌశిక్ వెండి పతకం సాధించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో మాదల చైతన్య మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి పతకాలు, బహుమతులు సాధించడం గర్వకారణమన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించవచ్చున్నారు. క్రీడాకారులకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం, తన వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.క్రీడాకారులను ప్రోత్సహిస్తే మన రాష్ట్రం నుంచి మరింత మంది ప్రతిభావంతులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు గెలిచే అవకాశం ఉందన్నారు. యువతను కేవలం అభినందించడం మాత్రమే కాకుండా,వారి ప్రతిభను గుర్తించి అవసరమైన సమయంలో ఆచరణాత్మకంగా అండగా నిలవడం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా



ఉందన్నారు."పతకాలు సాధించడం ఒక్క విజయం కాదు.. దేశం కోసం పోరాడే స్ఫూర్తిని యువతలో నింపడమే అసలైన విజయం" అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన యువతకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా బహుమతులు సాధించిన క్రీడాకారులు మాట్లాడుతూ తమలాంటి యువ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్న మాదల చైతన్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పోటీకి వెళ్లే సమయంలో అందించిన రెండు లక్షల ఆర్థిక సహాయం తమకు ఎంతో ధైర్యాన్ని ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకువస్తామని పేర్కొన్నారు. అనంతరం పవర్ లిఫ్టింగ్ కోచ్ ఘట్టమనేని సాయి రేవతి, బహుమతులు గెలుచుకున్న మధిర షానన్, బొల్లు లిఖిత, సంకా కౌశిక్ లను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాభిమానులు, వల్లంశెట్టి రమేష్, సి.హెచ్. విజయ్, పొన్నెకంటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు ముందే సమగ్ర సన్నాహాలు: డీజీపీ హరీష్ గుప్తా

**గుంటూరు, రాజధాని వాయిస్ :**స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు ముందుగానే సమగ్ర సన్నాహాలు పూర్తి చేసుకోవాలని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సూచించారు.సాధారణ పురపాలక ఎన్నికల నిర్వహణకు సంబంధించి సన్నాహక చర్యల్లో భాగంగా మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రాంతీయ సమాయత్త సమావేశం నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీపీ లా అండ్ ఆర్డర్ మధుసూదన్ రెడ్డి, ఐజీపీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, గుంటూరు రేంజ్ డీఐజీ ఫకీరప్ప, డీఐజీ లా అండ్ ఆర్డర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా 18 మండలాలు, 257 గ్రామపంచాయతీలు, 16 జడ్పీటీసీలు, 248 ఎంపీటీసీలు; పల్నాడు జిల్లా 28 మండలాలు, 525 గ్రామపంచాయతీలు, 434 ఎంపీటీసీలు, 28 జడ్పీటీసీలు; బాపట్ల జిల్లా 20 మండలాలు, 346 గ్రామపంచాయతీలు, 20 జడ్పీటీసీలు, 297 ఎంపీటీసీలు, 3 మున్సిపాలిటీలు; ప్రకాశం జిల్లా 516 గ్రామపంచాయతీలు, 27 జడ్పీటీసీలు, 377 ఎంపీటీసీలు, 5 మున్సిపాలిటీలు; మార్కాపురం జిల్లా 46 గ్రామపంచాయతీలు, 21 జడ్పీటీసీలు, 275 ఎంపీటీసీలు; నెల్లూరు జిల్లా 976 గ్రామపంచాయతీలు, 6 మున్సిపాలిటీలకు సంబంధించిన వివరాలపై డీజీపీ సమీక్ష నిర్వహించారు.

ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వెలువడే అవకాశం ఉన్నందున, నోటిఫికేషన్‌కు ముందే అవసరమైన పనులను పూర్తి చేసుకుంటే ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించవచ్చని డీజీపీ తెలిపారు. రాజ్యాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల నిర్వహణ జరగాలని డీజీపీ గారు స్పష్టం చేశారు.

పోలీస్ అధికారులు చేపట్టాల్సిన ప్రధాన చర్యలు గురించి డీజీపీ ఆదేశాలు ఇచ్చారు.

**శాంతిభద్రతలు -- ముందస్తు నివారణ చర్యలు:**

- గత ఎన్నికల్లో ఘర్షణలు, వివాదాలు చోటుచేసుకున్న ప్రాంతాలను గుర్తించి సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలి. డీఎస్పీ స్థాయి అధికారులు హైపర్ సెన్సిటివ్ గ్రామాలను పరిశీలించి, వాటి సమస్యలను పూర్తిగా తెలుసుకోవాలి. సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన ముందస్తు నివారణ చర్యలు, బైండ్‌ఓవర్ ప్రొసీడింగ్స్ చేపట్టాలి. బైండ్‌ఓవర్‌ను పెద్ద మొత్తంలో, రూ.10 లక్షల వరకు చేయించాలి. నాటుసారా, అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలి.

ఫ్యాక్షన్ గ్రామాల్లో ఇంతకుముందు 2021, 2024 సంవత్సరాల్లో నమోదైన కేసుల పురోగతిని పరిశీలించి, వాటిపై తగు చర్యలు తీసుకోవాలి.

**పోలింగ్ కేంద్రాల భద్రత:**

- పోలింగ్ కేంద్రాలను సాధారణ, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్‌గా వర్గీకరించి, వాటి ప్రాధాన్యతకు అనుగుణంగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలి. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతాపరమైన లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలి. రూట్ మొబైల్స్, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధంగా ఉంచాలి.బ్యాలెట్ బాక్సులు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల భద్రత: బ్యాలెట్ బాక్సుల రవాణా,




భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.

- భద్రతా విధుల్లో ఉన్న సిబ్బందికి వారి బాధ్యతలు, విధులపై స్పష్టమైన అవగాహన కల్పించాలి.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి:** లైసెన్స్ కలిగిన ఆయుధాలను నిబంధనల ప్రకారం డిపాజిట్ చేయించే ప్రక్రియను పూర్తి చేయాలి.ఎన్నికల ప్రచార సభలు, ర్యాలీలు, సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి. అనుమతి లేని సభలు, ర్యాలీలు, సమావేశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

**అంతర్‌శాఖల సమన్వయం:**

రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగించాలి. అత్యవసర సమాచార మార్పిడికి వైర్‌లెస్, కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలి. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికల అనంతరం చేపట్టాల్సిన పోలీస్ విధులపై అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించాలి.

మధుసూదన్ రెడ్డి, లా అండ్ ఆర్డర్ ఐజీపీ

ఎన్నికల గురించి ముఖ్యమైన సూచనలు, సలహాలను జిల్లా ఎస్పీలకు ఇచ్చారు.

గుంటూరు ఐజీపీ సర్వ శ్రేష్ట త్రిపాఠి మాట్లాడుతూపోలీస్ స్టేషన్ పరిధిలో గొడవలు జరిగే ప్రాంతాలను గుర్తించాలి. పార్టీలలో ఎవరు గొడవలకు పాల్పడతారు, ఎవరు వాటిని సోషల్ మీడియాలోకి పంపిస్తారు అనే విషయాలను గమనించాలి .గ్రామాల్లో కార్డన్ సెర్చ్‌లు నిర్వహించి, అక్రమ ఆయుధాలను గుర్తించాలి.ట్రబుల్ ట్రబుల్‌ను గుర్తించి, వారిని పది లక్షల వరకు బైండ్‌ఓవర్ చేయాలి. ప్రాపర్టీ అటాచ్మెంట్ కూడా చేయాలి.ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందే సిద్ధంగా ఉండాలి. ప్రజల కోసం బాగా పనిచేయాలి.స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం తక్కువ సమయంలోనే ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉండే అవకాశం ఉన్నందున, పోలీస్ అధికారులు ఇప్పటి నుంచే అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని సూచించారు.బ్యాలెట్ బాక్సుల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సుల రవాణా, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ కేంద్రాల వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని, వారితో పోలీస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని అన్నారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**

ఎన్నికల సమయంలో పత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు, మత, వర్గ విద్వేషాలకు దారితీసే ప్రచారంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ తెలిపారు

# లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి వరుణ హోమం

**గుంటూరు, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ లో రైతులు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్సంకల్పంతో 175 నియోజవర్గాల్లో వరుణ హోమాలు నిర్వహిస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన వరుణ హోమం కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు దేవాలయాల్లో వరుణ హోమాలు, యాగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైష్ణవ ఆలయాల్లో వరుణ హోమాలు, హోమాది కార్యక్రమాలు, శైవ ఆలయాల్లో సహస్ర ఘటాభిషేకాలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు చెప్పారు.రైతులు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్సంకల్పంతో ఈ వరుణ హోమం కార్యక్రమాలను చేపట్టారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా అనేక ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం పరంగా



తీసుకుంటున్న చర్యలతో పాటు దైవబలం కూడా ఎంతో అవసరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గంలోని ప్రధాన దేవాలయాల్లో వరుణ యజ్ఞాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనూ శ్రీ రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో వరుణ హోమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమానికి భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం సంతోషకరమని, దేవదేవుని ఆశీస్సులతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

# 'మార్పు' వసతి గృహాల్లో రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు



**గుంటూరు, రాజధాని వాయిస్ :** "మార్పు"వసతి గృహాలకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మార్పు కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్పు కార్యక్రమం క్రింద జిల్లాలో 36 వసతి గృహాలలో మంచి మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టడం జరుగుతోందని వివరించారు. వసతి గృహాలు ప్రవేశాలు, వంట గదిలో విధిగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తాడికొండ, రాజా గార్డెన్ లో వెంటనే బిసి వసతి గృహం, గురుకులం లలో పనులు తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, ప్రకృతి వ్యవసాయం డి.పి.ఎం రాజ కుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప, సర్వ శిక్షా అభియాన్ ఎపిసి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు బ్రహ్మానాయుడు స్కూల్ విద్యార్థులు ఎంపిక

**కారంపూడి.అక్టోబర్ 06రాజదాని వాయిస్ :** ఈనెల 3,4 తేదీలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో అండర్ 14 మరియు అండర్ 17 బాల బాలికల జట్ల ఎంపికలు బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగినవి. ఈ ఎంపికలలో బ్రహ్మానాయుడు స్కూల్ విద్యార్థులు హర్షిత,అఖిల,మాధురి,రేవతి, జస్లిక, హర్షద్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ.శివ సేషిరెడ్డి తెలిపారు. ఎంపిక కాబడిన విద్యార్థులు అందరూ కూడా ఈనెల 10,11, 12 వ తేదీ లలో బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్య వహిస్తారని పాఠశాల పిడి మరియు స్టేట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ఐ స్వర్ణరాజు తెలిపారు.ఎంపిక కాబడిన విద్యార్థిని, విద్యార్థులను మరియు పాఠశాల వ్యాయామ




ఉపాధ్యాయులు స్వర్ణ రాజు, అమల, సుష్మిత లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు బోదనేతర సిబ్బంది అభినందించారు.

# రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జిగా బాలాజీ నాయక్ నియామకం

**కారంపూడి. అక్టోబర్ 06 రాజదాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలికల భద్రత సాధికారిక మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఇన్చార్జిగా డాక్టర్ రామావత్ బాలాజీ నాయక్ ను నియమించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఆత్మ రక్షణ నిపుణులు వ్యక్తిగత భద్రత అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం మహిళా సాధికారిక మరియు నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాలు సమన్వయం పరిరక్షణ మరియు విజయవంతమైన అమలకు డాక్టర్ రామవత్ బాలాజీ నాయక్ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో బాలికలందరూ సమర్థవంతమైన ఆత్మరక్షణ శిక్షణ అందించి వారిలో ధైర్యం ఆత్మవిశ్వాసం రక్షణ సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తానని వారు అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సేవా క్రీడారంగాలలో డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ముందంజ

**నరసరావుపేట, అక్టోబర్ 6 రాజధాని వాయిస్ :** వైద్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్న డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్, క్రీడారంగంలోనూ తమ సత్తాను చాటింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని డీవీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన నరసరావుపేట టౌన్ హాస్పిటల్స్ చాంపియన్స్ టోర్నమెంట్లో అంజిరెడ్డి హాస్పిటల్స్ క్రీడా బృందం ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచింది. టోర్నమెంట్‌లో సాధించిన చాంపియన్స్ ట్రోఫీని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి క్రీడా సిబ్బంది సాదరంగా అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, వైద్యరంగంలో సేవాభావంతో ముందుకు సాగుతున్న తమ సంస్థ ఉద్యోగులు క్రీడారంగంలోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు. క్రీడలు ఉద్యోగుల్లో ఆరోగ్యం, ఉత్సాహం, టీమ్ స్పిరిట్‌ను పెంపొందించడంతో పాటు పరస్పర సహకార భావనను బలోపేతం చేస్తాయన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి సంస్థకు గుర్తింపు తీసుకువచ్చిన క్రీడా సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏఓ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం

**రాజుపాలెం. అక్టోబర్ 06,రాజధాని వాయిస్:** మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు, హరిత రాయబారులు, షెడ్ మిత్రలకు సత్తెనపల్లి మండలంలోని నందిగామ గ్రామపంచాయతీ నందు గల ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రం వద్ద ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇంటింటి చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయడం,పొడి చెత్తను స్వచ్ఛ రథం ద్వారా సేకరించి ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రానికి తరలించడం,బిన్ బ్యాగ్ సిస్టమ్‌ను ప్రతి ఇంటికీ అలవాటు చేయడం, తడి చెత్తతో కంపోస్ట్ తయారు చేయడం,పొడి చెత్తను స్వచ్ఛ రథం వాహనానికి అందించి, దానికి బదులుగా అవసరమైన కిరాణా సరుకులు పొందే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ శ్యామ్, ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.




# దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత

**దుర్గి అక్టోబర్ 06 రాజధాని వాయిస్ :**కంచరగుంట గ్రామానికి చెందిన దివ్యాంగుడు బండి వెంకటేశ్వర్లుకు మండవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్‌ను మంగళవారం అందజేశారు. నడవలేని స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లు గతంలో సైకిల్ సహాయంతోనే బయటకు వచ్చి జీవనం సాగించేవారు. అయితే గత కొంతకాలంగా ఆ సైకిల్ పాడైపోవడంతో ఆయన ఇంటికే పరిమితమైన విషయాన్ని గమనించిన ట్రస్ట్ అధినేత రవి, ఆయన సహాయక బృందం వెంకటేశ్వర్లుకు కొత్త సైకిల్ ఇస్తామని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం గ్రామ పెద్దలు, స్థానికుల సమక్షంలో ట్రస్ట్ సభ్యులు ఆయనకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జె వెంకటేశ్వర్లు,బొంత కృష్ణ, కుందుర్తి చెన్నకేశవులు, మాదాసు భిక్షమయ్య, నెంబర్ అన్నవయ్య, శ్రీపతి కొండలు, బిర్నిడీ బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు ఎస్ఐ బి.గోపాల్

**దుర్గి. అక్టోబర్ 06 రాజధాని వాయిస్ :** జిల్లా ఎస్పీ జగదీష్ అదహల్లి ఆదేశాల మేరకు దుర్గి మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ బి. గోపాల్ తెలిపారు. మండలంలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ముఖ్యంగా అడిగొప్పల గ్రామ శివారులోని ఎర్రవాగు కాలువ బ్రిడ్జి, పోలేపల్లి క్రాస్ రోడ్డు వద్ద బారికేడ్లు, ప్రమాద హెచ్చరిక సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని, హెచ్చరిక బోర్డులను గమనిస్తూ వేగాన్ని అదుపులో ఉంచుకుని ప్రయాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.



# దేవరంపాడు నగరవనంను వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**రాజుపాలెం.అక్టోబర్ 06,రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆటవిశాఖ మంత్రి కె పవన్ కళ్యాణ్ చేతుల మీదగా రాష్ట్రవ్యాప్తంగా నగరవనాలు వర్చువల్ గా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, కొండమోడు దేవరంపాడు నగరవనం ఇనాగరేషన్ సందర్భంగా ఒంగోలు డిఎఫ్ఓ వినోద్ కుమార్,నరసరావుపేట ఎఫ్ఆర్ఓ డివి రమణ,నకరికల్లు సెక్షన్ డీఆర్ఓ బివిఎల్ నాయుడు, గుండ్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం శ్యామ్ కుమార్,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు దేవరంపాడు వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ తెలగనేని వెంకటేశ్వర్లు, కె ఎన్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు,బాడిశ మస్తాన్ రావు నగరవనం ప్రారంభించిన సందర్భంగా మొక్కలు నాటి హరిత విప్లవ యొక్క విశిష్టతను విద్యార్థులు విద్యార్థులకు తెలియజేసినారు.

# గుండ్లపల్లిలో ఎన్నికల శాంతిభద్రతలపై పోలీసుల సదస్సు

**నకరికల్లు.అక్టోబర్ 06రాజధాని వాయిస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జగదీశ్ అదహల్లి ఆదేశాలతో అతి సున్నిత గ్రామమైన గుండ్లపల్లిలో పోలీసులు శాంతిభద్రతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు, రాజకీయ పక్షాలు సహకరించాలని, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని సత్తెనపల్లి రూరల్ సీఐ పి. కిరణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో నకరికల్లు ఎస్సై సతీష్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# డ్రోన్ కెమెరాలతో పోలీసుల నిఘా

- నేర ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక పర్యవేక్షణ
- జిల్లా వ్యాప్తంగా భద్రతా చర్యలు ముమ్మరం
- నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం

**బాపట్ల, రాజధాని వాయిస్ :** బాపట్ల జిల్లా పోలీసు అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేర ప్రభావిత ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగుతోంది. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాలను ముందస్తుగా అరికట్టే లక్ష్యంతో ఈ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.జిల్లాలో నేరాలకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అనుమానాస్పద కదలికలు, అక్రమ కార్యకలాపాలు, ప్రజా భద్రతకు ముప్పుగా మారే పరిస్థితులను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతోందని అధికారులు పేర్కొన్నారు. సాంప్రదాయ గస్తీ విధానాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతోందని పోలీసులు తెలిపారు. డ్రోన్ కెమెరాల ద్వారా విస్తృత ప్రాంతాలను తక్కువ సమయంలో పరిశీలించే అవకాశం లభిస్తోందని వివరించారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, ప్రజా రద్దీ ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తక్షణమే పోలీసు బృందాలను అక్కడికి పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని జిల్లా పోలీసు అధికారి పేర్కొన్నారు. నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రోన్ నిఘా కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు. భవిష్యత్తులో కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి కొనసాగిస్తామని వెల్లడించారు.



# ప్రతి ఇంటికీ సౌర విద్యుత్: ఎమ్మెల్యే

**నందిగామ,రాజధాని వాయిస్ :** ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని ఆంధ్రప్ర దేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ గాంధీ సెంటర్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యుత్ సేవా సేతు' కార్యక్రమంలో ఆమె విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పాల్గొని ప్రజలకు సౌర విద్యుత్ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా గృహాలపై పైకప్పు సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన వినియోగదారులకు సబ్సిడీ, దరఖాస్తు విధానం, విద్యుత్ కొలమానాల అనుసంధానం, సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలపై ఒకే వేదికలో సమాచారం అందిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేస్తోందని తెలిపారు. ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని చెప్పారు. అదే సమయంలో పునరుత్పాదక ఇంధన వినియోగం పెరగడం వల్ల పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, సబ్సిడీలు, బ్యాంకు రుణ సదుపాయాలు, సాంకేతిక మార్గదర్శకాలు అందుబాటులో ఉండటంతో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు మరింత సులభతరం అవుతోందని అధికారులు వివరించారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో అక్టోబర్ 6, 7, 8 తేదీలలో ప్రత్యేక సేవా సేతు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారం, దరఖాస్తుల స్వీకరణ, సాంకేతిక సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా ప్రజలకు చేరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు సౌర విద్యుత్ పథకాలను వినియోగించుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన ఇంధన వినియోగానికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.




# వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కోవూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 6 :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, మత్స్యకారులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు మండలం రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించి న వరుణ యాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ లు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రకృతి అనుకూలించి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షా లు కురవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఈ యాగాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, మత్స్యకారులు అధికంగా నివసించే విడవలూరు మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చడం ప్రత్యేకత సంతరించుకుందని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆశీస్సులతో రైతులకు మంచి పంట దిగుబడులు, మత్స్యకారులకు సమృద్ధిగా ఆదాయం లభించాలని కోరుకున్నట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఈ ఏడాది వ్యవసాయ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా పుట్టి వడ్లకు రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు ధర లభిస్తోందని రైతులు చెబుతున్నారని వెల్లడించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com